# శిలలు కరిగిన రాత్రి

## చింతల అనసూయ




**అవిగో...!**

**అవే హిమాలయాలు...**

**ఉదయ సుందరి శిరస్సున సువర్ణ కుంభాన్ని ధరించి హిమాలయ ప్రాంగణంలో నీరెండ కళ్ళాపి చల్లుతోంది.** ఎత్తైన దేవదారు కొమ్మల మధ్య దాక్కున్న కోకిలమ్మ పంచమ స్వరంలో ప్రభాత రాగాన్ని వీనులకు విందుగా వినిపిస్తోంది. మలయ మారుతాలు మెలమెల్లగా వీస్తూ మానస సరోవరంలోని పసిడి అలల్ని పలుకరిస్తున్నాయి. హిమాలయ గిరి శిఖరాల మధ్యలోంచి రెట్టింపు ఉత్సాహంతో ఎగిరి దూకుతూ తమసా జలపాతం మైదానం వైపు వస్తోంది. తమసా వుత్సాహానికి కారణం వుంది.

సంవత్సరం తర్వాత మళ్ళీ కార్తీక పౌర్ణమి రోజు వచ్చింది. ఆ రోజు దేశ దేశాల నుండి భక్తులూ, ఋషులు, సాధువులు, యాత్రికులు వచ్చి 'తమసా'నదిలో స్నానమాచరించి పూజలు చేసుకుని వెళుతుంటారు.

అదే రోజు ఆ శిల్పి కూడా వస్తాడు. అతడిని గురించి తమసాకు తప్ప ఎవరికీ తెలియదు. మానస మందిరంలో 'పార్వతీదేవి' విగ్రహం తన ఉలితో తీర్చి దిద్దింది ఆ శిల్పే. ఆ శిల్పిని చూడాలని, అతని పాద స్పర్శ చేయాలని తమసా ఎప్పటి నుండో ఎదురు చూస్తోంది. హిమాలయాల క్రింద పచ్చిక బయళ్ళ మధ్య మానస మందిరం వెలువడటానికి అతనే మూల కారకుడు. ఎక్కడో పడివున్న ఓ మామూలు శిలను శివలింగంగా చెక్కి దానికి దైవత్వాన్ని ప్రసాదించిన

మహానుభావుడు. అతను వస్తున్నాడని తెలిసిన తమసా ఆనంద పడిపోతోంది.

తన వ్యక్తిత్వానికీ, ఔన్నత్యానికీ ఒక ప్రత్యేకతను కల్పించిన నిష్కామ సాధకుడు ఆ శిల్పి. అతనికి శిలల భాషేకాదు. అలల భాష కూడా తెలుసు. ప్రతి సంవత్సరము కార్తీక పౌర్ణమినాడు హిమాలయాలకు వచ్చి తనకు దర్శనమిమ్మని తమసా కోరితే శిల్పి సరే నన్నాడు. ఆ శిల్పి అంటే గిట్టని గండు శిల లెన్నో ఉన్నాయి. అతన్ని మట్టు పెట్టాలన్న ఆలోచనలో వున్నాయి. తనంటే కూడా వాటికి గిట్టదు

❋ ❋ ❋

చంద్ర. సూర్యకాంత శిలలు, నీలి వర్ణ స్ఫటికాలు. గండు శిలలు తమలో తాము గుసగుసలాడుకుంటున్నాయి.

"చంద్రా" పిలిచింది సూర్యకాంత శిల.

"ఏమిటీ!" కుతూహలంతో అడిగింది చంద్రకాంత.

"తమసా నదిని చూస్తున్నావా?"

"చాలా హుషారుగా వుంది. ఏమిటి సంగతి?"

"ఆ శిల్పిగాడు ఈ రోజు వస్తున్నాడుగా! అందుకే ఆమెకు ఆ వెర్రి! శిల్పిని ఎప్పటి నుండో ఆరాధిస్తోంది."

"మనల్ని కాదని ఓ పనికి మాలిన శిలను పార్వతి విగ్రహంగా మార్చాడు."

"మనమెంత బ్రతిమాలినా వినలేదు కదా! ఏమీ లేని ఆ బోడి రాయికి ఇప్పుడు ఎన్ని పూజలో...!"

"అవును. ఆ శిల్పిని ఈ రోజు ఊరకే వదిలి పెట్టకూడదు".

"ఐతే ఏం చేద్దామంటావ్?"

"నాకు గాలిలో ఎగిరే విద్య తెలుసు. ఆ శిల్పి ఈ రోజు తమసాలో స్నానం చేసి శివార్చనకు మెట్లు ఎక్కేప్పుడు అతడి శిరోభాగాన్ని ప్రక్కలయ్యేలా మోదుతాను..."

"తల గాయమైనా ఛస్తాడన్న నమ్మకమేంటీ?"

"అందుకే నీవు విష పల్లవాల్ని తెచ్చి రసం తీసి వుంచు. దాన్ని, నేను త్రాగి ఆ శిల్పిని గాయ పరుస్తాను. విష పల్లవ రస ప్రభావం చేత అతను వెంటనే చనిపోయే అవకాశముంది. దాని స్పర్శతో మానవ శరీరమంతా నల్లగా మారిపోతుంది. దీని వల్ల గాయపడిన వాడెవడూ బ్రతికి బయటపడలేదు."

"ఇదంతా గుట్టుగా చేయాలి. తమసాకు ఏ మాత్రం తెలియనివ్వరాదు."

"అలాగే!" అంటూ శిలలు మౌనం వహించాయి.

ఈ విషయం మలయమారుతాలు వెళ్ళి తమసాతో చెప్పాయి. తెలియగానే తమసా -

"ఏమిటీ దారుణం? మంచి చేసిన వాడికి ఈ మారణహోమం?" అనుకుంది.

## చుంబనాల రికార్డ్!



గతంలో మల్లికా షెరావత్ పేరున వున్న ముద్దుల రికార్డు ఇప్పుడు దియామీర్జా సొంతం చేసుకోబోతోంది. మల్లిక మర్డర్‌లో 17 ముద్దు సీన్లలో నటిస్తే ఇప్పుడు దియా 'తుమ్సా నహీ దేఖా' చిత్రంలో అంతకు మించిన చుంబనకేళిలో పాల్గొన్నట్లు ఆ చిత్ర యూనిట్ చెబుతోంది. అంటే బాలీవుడ్ వెండితెరపై అధిక చుంబనాలు పొందిన మగువగా దియా రికార్డు సృష్టించబోతోందన్నమాట!

❋ ❋ ❋

భానోదయమౌతోంది. బాల భాస్కరుని నులివెచ్చని కిరణాలు వెండి కొండల మీద పడి ప్రతిఫలిస్తున్నాయి. రంగు రంగుల జాతి రత్నాలు రాశులుగా పోసినట్టు హిమాలయాలు అతి రమణీయంగా శోభిస్తున్నాయి. పాదాల దగ్గర నిశ్శబ్దంగా అక్కడక్కడ వెలసిన తటాకాలు అద్దంలా మెరసిపోతున్నాయి.

మానస మందిరంలో బ్రాహ్మణోత్తముల వేద మంత్రాల ఘోషతో పాటు గంటారావాలు కూడా వినబడుతున్నాయి. స్వర్ణపాత్రల్లో నైవేద్యాన్ని నింపుకుని పురోహితులు వడివడిగా గుడివైపుకు సాగిపోతున్నారు. వారినోటి వెంట కూడా శివస్తోత్రం వినబడుతోంది. ఆలయ ప్రాంగణంలో స్నానమాచరించి వచ్చిన భక్తులు బారులు తీరి వున్నారు. గర్భగుడిలో శివ-స్తుతి సాగుతోంది. గర్భగుడి తెరను ఇంకా తొలిగింపలేదు.

అంత జనంలో ఒకడైన శిల్పి, మెట్లు దిగుతూ నదిలో పాదాలు వుంచగానే పులకించి పోయిన తమసా మనసులో నమస్కరించుకుంది.

"ఎలాగున్నావు తమసా?" పలుకరించాడు శిల్పి.

"నా మాటను దక్కించారు. మీ దర్శనం కోసం ఎప్పటి నుండో ఎదురుచూస్తున్నాను. మీ పాదాల స్పర్శతో నా జీవితం పావనమైంది. నన్ను దీవించండి!"

"శుభమస్తు! భగీరథ ఎలా వుంది?"

"బాగుంది! మీరు జాగ్రత్తగా వుండండి! శిలలు కుట్ర పన్ని మీ ప్రాణాల్ని హరించాలని ఎత్తులు వేశాయి. ఏ క్షణమైనా ప్రమాదం జరుగవచ్చు! మీరు త్వరగా స్నానమాచరించి గుడిలోకెళ్ళి పోండి!"

"ఈశ్వరాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు. నీవు కంగారు పడకు తమసా! దైవదర్శనం చేసుకున్న తర్వాత మాట్లాడుకుందాం!" అంటూ స్నానం చేసి శిల్పి అంజలితో గంగాజలాన్ని భాస్కరునికి అర్పించి మెట్లు ఎక్కసాగాడు.

మరోవైపు చంద్రకాంత శిల. విష పల్లవ రసాన్ని గ్రోలి మత్తుగా తూలుతూ ఆకాశంలో ఎగిరెగిరి వస్తోంది. బంగారు గోపురం చుట్టూ తిరుగుతున్న మేఘమాలికలు వింతగా చంద్రకాంత శిలను చూడసాగాయి. శిల్పిని చూసి చంద్రకాంత విషపు నవ్వు నవ్వింది. పైకి ఎక్కుతున్న శిల్పి శిరోభాగాన్ని ఆ శిల బలంగా తాకింది. తల చిట్లి రక్తం చిందింది.

"అమ్మా! పార్వతీమాతా" అంటూ శిల్పి

బాధగా మూల్గి అక్కడే ఒరిగిపోయాడు. భుజం మీద వ్రేలాడుతున్న సంచీ ప్రక్కకు జారి పడిపోయింది. అందులోంచి వులి శిల్పిని జాలిగా తొంగి చూసింది. కొన్ని నిముషాల తర్వాత తేరుకున్న శిల్పి, ఇదంతా శిలల కుట్రగా అర్థం చేసుకున్నాడు.

"ఏమిటీ దారుణం?" శిలలను ప్రశ్నించాడు శిల్పి.

ఇది విన్న శిలలన్నీ ఫక్కున నవ్వాయి.

"ఎందుకూ పనికిరాని ఓ పాషాణాన్ని పార్వతిమాతగా మార్చావు. మాకు మాట మాత్రమైనా చెప్పిన పాపాన పోలేదు. మాలో దివ్య శిలలెన్నో వున్నాయి. అందరినీ నీవు నీ అహంకారంతో విస్మరించావు. అందుకే నీకీ శిక్ష..." అంటూ సమాధానంగా పలికింది సూర్యకాంత శిల.

"గర్భగుడిలో భోగభాగ్యాల్ని అనుభవిస్తున్న శిల విశిష్ఠత ఏమిటి? మాలో లేనిదేమిటి?" చంద్రశిల హూంకరించింది.

తలా ఒక మాటతో శిలలన్నీ శిల్పి హృదయాన్ని గాయపరిచాయి.

"ఆదిపరాశక్తిగా పూజలందుకుంటున్న ఆ శిల మీ జాతికి చెందినదే కదా? మీలో మీకు వైషమ్యాలా? మీరందరూ ఒకటేననుకున్నాను. మీలో ఎవరికి అందలం అందినా అందరూ ఆనందిస్తారనుకున్నాను. ఇలా ఈర్ష్యా-ద్వేషాలతో రగిలిపోతారనుకోలేదు. అన్ని శిలలూ శివలింగాలు కాలేవు. కొన్నింటికే ఆ అదృష్టం దక్కుతుంది." అన్నాడు ఆ శిల్పి.

"వైషమ్యాలు ప్రకృతిలోనే వున్నాయి. మేము సృష్టించినవి కావు. అపాత్రతా దానం మంచిది కాదు. నీవు శివలింగంగా మార్చిన శిల అధమ జాతికి చెందినది. దేవాలయాన్ని ఆశ్రయించే శిలకు ఏ గుణగణాలుండాలన్నది నీకు తెలియంది కాదు. అయినా నీ అహంకారమే అలా నిన్ను చేయటానికి ప్రేరేపించింది" అన్నది సూర్యకాంత.

"నీ వులి పోటును తట్టుకునే శక్తి మాకూ వుంది. దివ్యత్వాన్ని పొందే ఆశ మాకూ వుంటుంది. పక్షపాత ధోరణితో వ్యవహరించావు. ఈ శాస్తి నీకు జరిగి తీరవలసిందే!..." అంటూ బిగ్గరగా నవ్వింది గండు శిల.

"వినాశకాలే విపరీత బుద్ధిః!" అంటూ శిల్పి తన బలాన్నంతా కూడ గట్టుకుని లేచి నిల్చున్నాడు. భక్తులంతా శిల్పివైపు జాలిగా, వింతగా చూడసాగారు. అతను ఎవరితో మాట్లాడుతున్నది ఎవరికీ అర్థం కాలేదు.

శిల్పి పడిపోయిన సంచిలోంచి ఉలి, సుత్తిని బైటకు తీసి ఆవేశం, ఆవేదన మిశ్రిత మైన కంఠంతో బిగ్గరగా యిలా అన్నాడు-

"నా బాహువుల్లో ఇంకా శక్తి వుంది. కానీ ఎక్కువకాలం జీవించే అవకాశం లేదు. సూర్యాస్తమయం అయ్యేలోగా మీలో ఒక్కరికి మాత్రమే దైవత్వాన్ని ప్రసాదించగలను. నా వులి దెబ్బలకు, సమ్మెట పోట్లకు తట్టుకునే శక్తి మీలో వున్న వారే ముందుకు రండి! జరిగిపోయిన దాన్ని వగచి సమయాన్ని వృథా చేయకండి! మీరంతా కలిసి ఒకర్ని ఎన్నుకుని నా దగ్గరకు పంపించండి" అంటూ ప్రాధేయ పడుతున్నట్టు అడిగాడు శిల్పి.

శిలల్లో కలకమూ, గుసగుసలూ మొదలయ్యాయి. నేనంటే నేనంటూ ఒక శిలతో మరొక శిల ఢీకొనసాగింది. అన్నీ ముక్కలు చెక్కలై కరిగిపోసాగాయి. కరిగిపోతున్న శిలల భయంకర ఆర్తనాదాలను వింటూ నిశ్చేష్టుడైన శిల్పి అక్కడే కూలబడ్డాడు. మానస మందిరంలో పూజలు సమాప్తమైనట్లున్నాయి. జేగంటలు మ్రోగుతూ నలువైపులా ప్రతిధ్వనిస్తున్నాయి. అక్కడ నలువైపులా పలుకుదు బందలున్నాయో ఏమో కానీ, ప్రతి ధ్వని కూడా ప్రతిధ్వనిస్తూ వుంటుంది. శిల్పి తలనుండి జారిన రక్తం అరుణ కుంకుమలా మెట్లమీద సూర్యకిరణాలు పడి మెరుస్తోంది.

ఇది చూసిన తమసానది ఉవ్వెత్తున పొంగింది. శిలలను ఢీకొంటూ, ఎత్తు-పల్లాలను ఏకం చేస్తూ, వడి, వడిగా పరిగెడుతూ వస్తోంది. శిల్పి పాదాలను స్పర్శించి అతని రక్తాన్ని తన నొసట సింధూరంలా దిద్దుకొని కొనప్రాణంతో మూలుగుతున్న శిల్పిని తన వడిలోకి తీసుకుని ఎక్కడికో వెళ్ళిపోయింది.

చాలాకాలం తర్వాత ఒకనాడు భయంకరమైన భూకంపం వచ్చింది. మానస మందిరం ఒరిగి పడి శిథిలమైపోయింది. ఇన్నాళ్ళయ్యాక తమసా నది ఎక్కడికెళ్ళిందో. ఎలా ఉందో ఎవరికీ తెలియదు. శిల్పి ఏమయ్యాడో కూడా ఎవరికీ తెలియదు.

హిమాలయాల మధ్య ఏర్పడిన మైదానాలు ఇప్పుడు నిర్జనంగా, శూన్యంగా మారాయి. అక్కడ ఇప్పుడు ఏ శిలా లేదు. శిల్పి లేడు. మందిరం, శిల్పాలు లేవు. జరిగిన అనేక సంఘటనలకు సాక్షిగా హిమగిరి తటస్థంగా అలాగే మునివరుల్లా ధ్యానావస్థలో వుంది. ఎక్కడ ఏం జరిగినా ఒక్క క్షణం కూడా నేను ఆగటానికి వీల్లేదంటూ కాలం తన దారిన తాను సాగుతోంది. ✻


చదవండి! చదివించండి!!

**ఆటవిడుపు**

పిల్లల సచిత్ర మాస పత్రిక

**అక్టోబర్ 2004 సంచిక**

**విజ్ఞాన వినోదాల విపంచిక**

